తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
30 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

గ్రామపంచాయతీ పక్కనే బెల్టు షాపు దందా!

- ○కిరాణా దుకాణం ముసుగులో మద్యం విక్రయాలు
- ○ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని గ్రామస్తుల ఆరోపణ
- ○ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి
- ○డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్

మంథని, అక్టోబర్ 29, (జనంసాక్షి) : గ్రామ పంచాయతీ పక్కనే కిరాణా దుకాణం ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు మంథని మండలం గ్రామాలలో కలకలం రేపుతున్నాయి. నివాస ప్రాంతంలో, పట్టపగలే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని గ్రామ ప్రజలతో పాటు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు

మంథని మండలంలోని నాగేపల్లి గ్రామ పంచాయతీ పక్కనే ఉన్న కిరాణా దుకాణంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రాయల్ స్టాగ్ క్వార్టర్ బాటిల్‌పై ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర రూ.220 ఉండగా, ఇక్కడ రూ.250కు విక్రయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధిక ధరలపై ప్రశ్నిస్తే దుకాణం నిర్వాహకులు దురుసుగా సమాధానమిస్తున్నారని వాపోతున్నారు.

గ్రామంలో మహిళలు, విద్యార్థులకు ఇబ్బందులు

పంచాయతీ కార్యాలయానికి సమీపంలోనే, నివాస ప్రాంతంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

మంథని ఎక్సైజ్ శాఖ స్పందించాలి

ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ కోరారు. సంబంధిత దుకాణంలో తనిఖీలు నిర్వహించి, మద్యం విక్రయాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు

విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం మద్యాన్ని స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాగేపల్లిలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పుడు స్పందిస్తారో, ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గణేశ్‌నగర్‌లో గదిలో చిక్కుకున్న 18 నెలల బాలుడు

చాకచక్యంగా రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైమ్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో ప్రమాదవశాత్తు గదిలో చిక్కుకుపోయిన 18 నెలల బాలుడిని అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా రక్షించారు. చిన్నారి ఆడుకుంటూ గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవడంతో లోపలే చిక్కుకుపోయాడు. బాలుడు బయటకు రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఎఫ్ఓ కె. నరేశ్‌కుమార్ నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది యాదగిరి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, కిశోర్, ప్రసాద్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించిన సిబ్బంది చాకచక్యంగా తలుపు తెరిచి బాలుడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దీంతో చిన్నారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి బాలుడిని క్షేమంగా రక్షించిన అగ్నిమాపక సిబ్బందిని కుటుంబసభ్యులు ఊరటతో అభినందించారు.

బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం

బోధన్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సిపి ఆదేశాల మేరకు బోధన్

డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల సంస్మన్న దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వార్తా లోపలి పేజీలో

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు

- ○ అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- ○ యాసంగిలో వరి సాగు వద్దని రైతులకు హితవు
- ○ మాధవనగర్ ఆర్.ఓ.బీ పనులకు రూ. 42 కోట్లు కేటాయించామని వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనంసాక్షి: ఎల్ నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే వేసవి సీజన్ ముగిసే వరకు కూడా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి హాబిటేషన్ కు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా ముందస్తుగానే సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని అన్నారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి లేనందున వరి వేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, పశుగ్రాసం, యాసంగి పంటల సాగు, ఆర్ఓబీ ల నిర్మాణ పనుల పురోగతి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాల పనులు, నిజామాబాద్ కార్పొరేషన్ సహా బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, వార్తా లోపలి పేజీలో

భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- భూ భారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలి
- సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సుల్తానాబాద్,అక్టోబర్ 29(జనంసాక్షి) : భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, భూ పునఃసర్వే మొదటి విడతలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనులను వేగవంతంగా పూర్తి వార్తా లోపలి పేజీలో

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు

ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తాగు నీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకోవాలని కోరారు. ఆరుతడి పంటలకు కూడా అవసరం మేరకే సాగు నీరు వినియోగించుకునేందుకు వీలుగా రైతుల ప్రయోజనాల కోసం అన్ని మండలాలకు సబ్సిడీపై రెయిన్ గన్స్ మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఒక్కో యూనిట్ ధర 24 వేలు ఉండగా, అందులో 8 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ కింద భరిస్తుందని తెలిపారు. కాగా, మూగజీవాలకు కూడా పశు గ్రాసం కొరత, నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చోట నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై అందించాలని అధికారులకు సూచించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. అవసరమైన చోట పైప్ లైన్ల మరమ్మతులు చేపట్టి లీకేజీలు లేకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఉపయోగపడుతున్న చెరువులను పూర్తి స్థాయి నీటి నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా బోర్లు తవ్వించకుండా, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. అవసరమైతే కూలీల సంఖ్యను పెంచాలని అన్నారు. యంచ వద్ద గల న్యాల్కల్ పంప్ హౌజ్ ద్వారా నిర్దేశిత గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా చుక్క నీరు వృధా కాకూడదని, అదే సమయంలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

ఆర్.ఓ.బీ ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

ఇదిలాఉండగా, మాధవనగర్, అర్సపల్లి ప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాధవనగర్ ఆర్ఓబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతలలో రూ. 42 కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. అర్సపల్లి ఆర్ఓబీ కి కూడా రూ. 11 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ కొంత మంది నాయకులు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సౌకర్యార్థం ఆర్ఓబీ ల నిర్మాణాలను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు గడువు విధించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, రక్షిత నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్త కుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రవీణ్, అరవింద్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు స్వప్న, రాకేష్, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

చేయాలని సూచించారు. భూ భారతి కింద అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, గడువు దాటిన దరఖాస్తులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, సుల్తానాబాద్ తహసీల్దార్ బషిరుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం

పోలీసులు అమరులైన సంఘటన ఎప్పటికీ మరువలేరని, వారిని స్మరించుకుంటూ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మేరకు బోధన్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో 50 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించడం జరిగిందని ఎసిపి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ, బోధన రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూరు సిఐ, ఎస్ఐలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంథని విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తాం

46 ఏళ్ల స్ఫూర్తిదాయక పోరాటాన్ని స్మరించుకున్న పూర్వ విద్యార్థులు

మంథని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కొండేల మారుతి

మంథని, అక్టోబర్ 29, (జనంసాక్షి) :

మంథని ప్రాంత విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు, సామాజిక సేవకుడు కొండేల మారుతి అన్నారు. మంథనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటే లక్ష్యంగా 1980లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు 46 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన 'స్మృతి పథం ? 46 వసంతాలు' ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధి కోసం గతంలో చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల బలోపేతానికి ప్రతిపాదనలు

ఈ సందర్భంగా పలువురు వక్తలు మంథని ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడంతోపాటు, ఉన్నత విద్యకు అవసరమైన సదుపాయాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

కొండేల మారుతి సేవలకు ప్రశంసలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం న్యాక్ బృందం సందర్శించిన సందర్భంలో పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండేల మారుతి సముచిత సహకారం అందించారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పర్సయ్య ప్రశంసించారు. కళాశాల స్థాపన కోసం ఆయన చేసిన సేవలు, ఆమరణ నిరాహార దీక్ష వంటి స్ఫూర్తిదాయక పోరాటాలను ఈ సందర్భంగా పలువురు అతిథులు గుర్తుచేసుకున్నారు. కొండేల మారుతి ఆధ్వర్యంలో

మంథని విద్యార్థి యువత చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, స్ఫూర్తిదాయక కార్యక్రమాలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ మరిన్ని చేపట్టి విద్యార్థులకు, సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఆడేపు లక్ష్మీనారాయణ, సీనియర్ సిటిజన్ ప్రతినిధి, సామాజికవేత్త పోరెడ్డి వెంకటరెడ్డి, పెన్షనర్ల సంఘం పెద్దపల్లి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామడుగు మారుతీరావు, బీజేపీ నాయకుడు భోగోజు శ్రీనివాస్, సామాజిక విశ్లేషకుడు మధు, కాంగ్రెస్ పార్టీ మంథని డివిజన్ ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు వీరచారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి

జమ్మికుంట, అక్టోబర్ 29 (జనం సాక్షి):

జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్ హెచ్ ఎం) పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని జమ్మికుంట మండలంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు యండి. సాజిదా పర్వీన్, శ్యామల, రజిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్ హెచ్ ఎం) పథకం కింద 17, 541 మంది పలు కేటగిరిలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్దతిలో పని చేస్తున్నారని వివరించారు.

ఈ నెల 13 నుండి తాము రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 78 కేడర్లకు చెందిన వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నిషన్లు ఈ సమ్మెలో పాల్గొననున్నారని తెలిపారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనంతో పాటు ఆరోగ్య భద్రత, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందించాలని అదేవిదంగా సిబ్బందికి ప్రసూతి సెలవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పథకం కింద గత 20 సంవత్సరాలనుండి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్నామని, తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టు ఆడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఎన్ హెచ్ ఎం పథకం కింద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహించిన అనేక మందిని ఇతర రాష్ట్రాలలో రెగ్యులర్ చేశారని వివరించారు. మా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే క్రమబద్దీకరించి తమ కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తిరుమల, కవిత, సంధ్య, హైమ, రమ, మణి, రమ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు తగ్గుతున్న ఆదరణ.. విశ్వబ్రాహ్మణుల జీవనానికి గండం

బంగారం, వెండి ధరల పెరుగుదలతో వృత్తిదారుల పై ఆర్థిక భారం

పనులు తగ్గి - ఆదాయం పడిపోయి - అప్పుల ఊబిలో కుటుంబాలు

విశ్వబ్రాహ్మణులను బీసీ-బీ నుంచి బీసీ-ఏకు మార్చాలని డిమాండ్

వృత్తిదారులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, రుణ సదుపాయాలు కల్పించాలి

వృత్తులు కుదేలు.. అప్పుల ఊబిలో విశ్వబ్రాహ్మణులు

బీసీ-బీ నుంచి బీసీ-ఏకు మార్చాలి -రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వబ్రాహ్మణ సంఘం నేత రావుల రమేష్ విజ్ఞప్తి

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 29 (జనం సాక్షి) :

తరతరాలుగా కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న విశ్వబ్రాహ్మణుల బతుకులు రోజురోజుకూ భారంగా మారుతున్నాయి. సంప్రదాయ వృత్తులకు ఆదరణ తగ్గడం, బంగారం, వెండి ధరలు పెరగడం, పని అవకాశాలు సన్నగిల్లడంతో వృత్తిదారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు రావుల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తిపై ఆధారపడిన కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకుని, ఆర్థిక ఒత్తిళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కొందరు వృత్తిదారులు అనారోగ్య సమస్యలతోనూ సతమతమవుతూ దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

బీసీ-బీ నుంచి బీసీ-ఏకు మార్పు చేయాలి

విశ్వబ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని రావుల రమేష్ కోరారు. విశ్వబ్రాహ్మణులను బీసీ–బీ నుంచి బీసీ–ఏ వర్గానికి మార్చే అంశాన్ని పరిశీలించి, చట్టబద్ధమైన ప్రక్రియ ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వృత్తిదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ప్రభుత్వం స్పందించాలి.. వృత్తిదారులను ఆదుకోవాలి

తరతరాలుగా సంప్రదాయ కళలను, వృత్తులను కాపాడుకుంటూ వస్తున్న విశ్వబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని రావుల రమేష్ అన్నారు. వారి జీవనోపాధిని కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, బీసీ వర్గీకరణ మార్పు డిమాండ్‌పై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేసి, అర్హులైన వృత్తిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని రావుల రమేష్ విజ్ఞప్తి చేశారు.

వెంకటమ్మ కుటుంబానికి

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పరామర్శ

మంథని, అక్టోబర్ 29, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని దొంతులవాడ లో మంథని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రజ్యోతి ఆర్ సీ ఇంచార్జ్, టి యు డబ్ల్యు జే పెద్దపెల్లి జిల్లా ఎథిక్స్ కమిటీ చైర్మన్ పోతరాజు సమ్మయ్య మాతృమూర్తి పోతరాజు వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంథని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నక్క నాగేంద్ర-శంకర్ లు గురువారం పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల విచారణ వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులైన పోతరాజు శ్రీనివాస్, వెంకటేష్, వెంకటలక్ష్మి, తిరుమల, స్వప్నలను ఓదార్చి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ను

పంచాయతీరాజ్ ఏఈలు

కమాన్ పూర్, అక్టోబర్ 28, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వారి సోదరుడు వైనాల వినోద్ ను, వారి కుటుంబ సభ్యులను కమాన్ పూర్, రామగిరి మండలాల పంచాయతీరాజ్ ఏఈలు వరలక్ష్మి, జగదీష్, కన్నాల మాజీ సింగిల్ విండో చైర్మన్ బయ్యపు జగన్మోహన్ రెడ్డి, రొంపికుంట మాజీ సర్పంచ్ కటకం రవీందర్, ఏఎంసీ డైరెక్టర్ గుమ్మడి వెంకన్న, యూసఫ్ అల్లు, రామగిరి మండల పలువురు నాయకులు బర్ల శ్రీనివాస్, వాసు గౌడ్ తదితరులు గురువారం పరామర్శించారు. ఇటీవల ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు.

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలి

తాగునీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

ప్రజలకు సింగిల్ విండో చైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు విజ్ఞప్తి

కమాన్‌పూర్, అక్టోబర్ 29, (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, సాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కమాన్‌పూర్ సింగిల్ విండో చైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు సూచించారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ ఆదా కోసం సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రైతులు సాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ సూచనల మేరకు మొక్కజొన్న, తెల్లజొన్న, శనగ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో బోరుబావులు పనిచేయకపోతే ఎంపీడీవో లేదా గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కన్ సింగ్ ఠాగూర్ ఆదేశాల మేరకు అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎల్‌నినో ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించి నీరు, విద్యుత్‌ను బాధ్యతగా వినియోగించాలని భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక'

సైదాపూర్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా రాయిశెట్టి చంద్రయ్య

ప్రధాన కార్యదర్శిగా జక్కోజు బిక్షపతి

సైదాపూర్ అక్టోబర్ 29(జనం సాక్షి) భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు.గురువారం రోజున సైదాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక సైదాపూర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక

అధ్యక్షులుగా రాయిశెట్టి చంద్రయ్య ప్రధాన కార్యదర్శిగా జక్కోజు బిక్షపతి కోఆర్డినేటర్ గా గోపగోని నవీన్ గౌడ్

ఉపాధ్యక్షులుగా మట్టెల రవీందర్ మేకల రవీందర్ పెసర కుమారస్వామి గుండేటి వాసుదేవ్ భానోత్ కిషన్ నాయక్ లంకదాసరి కళ్యాణ్ పైడిమల్ల తిరుపతి గౌడ్ కార్యదర్శులుగా దుస్స కుమార్ మహ్మద్ రఫీ గౌరవ సలహాదారులుగా పొడిచెట్టి వెంకట్రాజామ్ పరకాల రమేష్ గౌడ్, రావుల రవీందర్ రెడ్డి దాసరి జీవన్ రెడ్డిలు సంయుక్త కార్యదర్శిగా మారుపాక తిరుపతి కార్యవర్గ సభ్యులుగా పోలిశెట్టి అజయ్ మిట్టపల్లి కిష్టయ్య సొల్లు వైష్ణవ్ తిప్పారపు రమేష్ సోమారపు రాజయ్య గాదెపాక కుమార్ రాజా గాదపాక అశోక్ భానోత్ శంకర్ నాయక్ బోడిగే ఆనంద్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ ఎన్నిక నిర్వాహకులుగా జేపీసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి గాదపాక రవీందర్ మేకల వీరన్న,వ్యాగల సారయ్య, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ రేణిగుంట్ల బిక్షపతి ఉప్పుల కుమారస్వామి జగదీష్ ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వచ్చిన భారత రాజ్యాంగ పరిరక్షణ బాధ్యులు నాయకులు సర్పంచులు మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ పై విద్యార్థులకు అవగాహన..

అంతర్గాం, జనంసాక్షి : విద్యార్థుల్లో అప్రమత్తతపై అవగాహన కల్పించేందుకు ఎన్‌టిపిసి రామగుండం పోటీలను నిర్వహించింది. ప్రస్తుతం కొనసాగుతున్న నివారణ అప్రమత్తత అవగాహన ప్రచారం 2026లో భాగంగా, ఎన్‌టిపిసి రామగుండం టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయం (కేవీ), సెయింట్ క్లెయిర్ స్కూల్, చిన్మోయ్ స్కూల్‌లలో చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం వంటి పలు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు నివారణ అప్రమత్తత, సమగ్రత, పారదర్శకత, నైతిక విలువలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాయి. తద్వారా విద్యార్థులు తమ దైనందిన జీవితంలో నిజాయితీ, జవాబుదారీతనం ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా ప్రోత్సహించాయి. ఈ కార్యక్రమాన్ని ఏజీఎం (విజిలెన్స్) రజిత్ కుమార్ గుండా మార్గదర్శకత్వంలో నిర్వహించారు. పోటీలలో ఉత్సాహంగా పాల్గొని, సృజనాత్మకంగా కృషి చేసిన విజేతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నివారణ అప్రమత్తత ప్రాముఖ్యతను, నైతిక పద్ధతులను ప్రోత్సహించడం లో వ్యక్తుల పాత్రను తెలియజేస్తూ, విజిలెన్స్ అవగాహన ప్రచారం 2026పై ఒక అవగాహన సదస్సు కూడా నిర్వహించారు. నిజాయితీ, పారదర్శకత, సమగ్రత పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, విద్యార్థులు, పాల్గొనేవారికి సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా, ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ సంస్థ యువతలో అప్రమత్తతపై అవగాహనను పెంపొందిస్తూ, నైతిక విలువలను పెంపొందిస్తూ, పారదర్శకమైన, జవాబుదారీ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతోంది.

అంజన్న హుండీ లెక్కింపులో లేఖ

నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి

ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలి

మల్యాల అక్టోబర్ 29 (జనం సాక్షి) తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం కొండగట్టు దేవస్థానంలో గురువారం నిర్వహించిన అంజన్న హుండీ లెక్కింపులో నారాయణపూర్ గ్రామస్తులు రాసిన లేక లభించింది,తామ కోరికలు లేఖలో రాసి హుండీలో వేస్తే నెరవేరుతాయి అన్న నమ్మకంతో గ్రామస్తులు హుండీలో లేఖ వేశారు.లేఖలో గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని,కొండగట్టు అంజన్న ఆశీస్సులు గ్రామస్తులపై ఎప్పుడూ ఉండాలని,ఎమ్మెల్యే సత్యం ఇచ్చిన హామీ మేరకు వెంటనే నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని రాశారు.

లింగన్నపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా

తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

గంభీరావుపేట, అక్టోబర్ 29, జనంసాక్షి:రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పరిధిలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలాల్ర్యూడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఔట్ పేషెంట్ (ఓపీ), ఇన్ పేషెంట్ (ఐపీ) విభాగాలతో పాటు ల్యాబ్‌ను పరిశీలించారు.అనంతరం ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణుల నమోదు, పరీక్షలు (ఏఎన్‌సీ), ఎన్‌సీడీ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ, ఫార్మసీ, ఎన్‌సీడీ విభాగాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణ తీరును సమీక్షించారు.ఈ తనిఖీలో డాక్టర్ గీతాంజలితో పాటు సూపర్‌వైజర్లు విజయ, సీతామహాలక్ష్మి, రాణి, రమ, మాధవి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌ది.. దాడుల సంస్కృతి బీఆర్‌ఎస్‌ది

కేకే నగర్ ఘటనపై వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదు: బత్తిని శ్రీనివాస్

యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి) అక్టోబర్ 29:
అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని 8వ కాలనీ 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బత్తిని శ్రీనివాస్ విమర్శించారు. ఇమేరకు 8వ కాలనీ ప్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతూ."అభివృద్ధి చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది.. దాడులు చేసే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీది" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలకు పరిష్కారాలు చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కేకే నగర్‌లో జరిగిన ఘటనపై స్పందిస్తూ.. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వారేనని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి దాడికి పాల్పడ్డాడంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే రాజకీయ నాయకులు స్పందించాలని సూచించారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తుంటే.. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం, ధర్నాలకు దిగడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. 8వ కాలనీ, 15వ డివిజన్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.రాజకీయాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే ఉండాలని బత్తిని శ్రీనివాస్ అన్నారు. అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ, అనవసర ఆరోపణలు, ధర్నాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.
ఈ విలేకరుల సమావేశం లో బండి వెంకట రాజం, బండ రమేష్ రెడ్డి, ఇరికి మహేష్, సదానందం, రబ్బాని, నవీన్ కుమార్, కనుకుంట్ల రాజేష్, వేముల రమేష్, అఖిల్, నాగరాజు, షేక్ ఫిరోజ్, ఉదయ్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం

పోతుగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అరుట్ల మహేష్

ముస్తాబాద్ అక్టోబర్ 29(జనం సాక్షి)
ముస్తాబాద్ మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పోతుగల్ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్ ఈ సందర్భంగా పోతుగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు దలార్ల మాట నమ్మి మోసపోకూడదు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. మండలంలో ఐకెపి గానీ, ముస్తాబాద్, పోతుగల్ సొసైటీ కేంద్రాల్లో కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే తన అకౌంట్లకు డబ్బులు అందించడం జరుగుతుంది, ఎవరి మాట నమ్మొద్దు మోసపోకూడదు ప్రభుత్వము రైతులను ఆదుకుంటుంది ప్రభుత్వము రైతుల కోసమే పనిచేస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆత్మ చైర్మన్ కొండం రాజిరెడ్డి, కరెడ్ల కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల రాజు, రంజాన్ నరేష్, వైస్ చైర్మన్ సడిమెల బాలయ్య, డైరెక్టర్లు అనమేని రాజు, రాజు, గోవర్ధన్ నాయక్, ఏపీఎం రాజు, శోభన్ బాబు, ఆంజనేయులు, ఉమా మహిళా సంఘం అధ్యక్షులు సిఏలు సీసీలు హమాలి సంఘం అధ్యక్షులు బుదయ్య రైతులుపాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ అటానమస్ గెస్ట్ లెక్చరర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 29, (జనం సాక్షి)
కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దసాని మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షుడిగా ఏ. మల్లేశం, కోశాధికారిగా పి. చైతన్య ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా పోకల నాగయ్య, బుంగ తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా బి. రాజు, ఇ. సమత, రిప్లిక, భోజన్న ఎంపికయ్యారు. డిగ్రీ గెస్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఉన్నత విద్యాశాఖ జేఏసీ అధ్యక్షుడు కడారి సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి అభినందించారు.

కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేత రాజీనామా

గంభీరావుపేట, అక్టోబర్ 29, జనం సాక్షి:

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, సింగిల్ విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్ పార్టీకి, క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 20 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న తనకు సరైన గుర్తింపు, ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన సమయంలో పార్టీ నేతలు సహాయం చేయలేదని, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సొంత ఖర్చులతో వైద్య సహాయం అందించారని గుర్తు చేశారు. పార్టీలో సామాజిక న్యాయం కొరవడిందని విమర్శిస్తూ, తన రాజీనామా లేఖను జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులకు పంపించినట్లు తెలిపారు.

చిగురుమామిడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడం బాధాకరం...
- హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు విజ్ఞప్తి..
- విలేకరుల సమావేశంలో చిగురుమామిడి సిపిఐ నాయకులు

చిగురుమామిడి అక్టోబర్ 29 (జనంసాక్షి):
ఏలినినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న చిగురుమామిడి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి,ఇక్కడి ప్రజలను, రైతాంగాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు,మాజీ జడ్పీటీసీ అందే స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పూర్తిగా మెట్ట ప్రాంతమైన చిగురుమామిడి మండలాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు కరువు మండలంగా ప్రకటించకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చిగురుమామిడి మండలంతో పాటు పూర్తి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఒకవైపు వరి పంట వేయవద్దని చెబుతోందని,అలాంటప్పుడు ప్రత్యామ్నాయంగా రైతులకు మొక్కజొన్నతోపాటు ఇతర ఆరుతడి పంటల విత్తనాలను పూర్తిస్థాయి సబ్సిడీపై అందజేయాలని కోరారు.అదేవిధంగా సాగుకు అవసరమైన ఎరువులను,పురుగుల మందులను రైతులకు ఉచితంగా పంపిణీ చేసి నష్టాల్లో ఉన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులకు సబ్సిడీలో పశువుల పంపిణీతోపాటు రైతులకు క్రాఫ్ లోన్ రుణాలను మాఫీ చేసి మళ్ళీ కొత్త రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ ను సన్మానించిన సర్పంచ్ శంకర్

ముస్తాబాద్ అక్టోబర్ 29 (జనం సాక్షి)
ముస్తాబాద్ మండలం గూడెంలో సర్పంచ్ తాటిపల్లి శంకర్ ఉపసర్పంచ్ వార్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్ ఓపెనింగ్ కు వచ్చిన నూతనంగా ఎన్నికైన పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి వైస్ చైర్మన్ సడిమెల బాలయ్య ముస్తాబాద్ మండల్ ప్రెసిడెంట్ గజ్జల రాజు , మాజీ మండల్ ప్రెసిడెంట్ ఎల్లా బాల్రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

ఎస్ జి ఎఫ్ క్రికెట్ పోటీలకు ఎన్ టి పి సి విద్యార్థులు

గోదావరిఖని, జనంసాక్షి :
ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎన్‌టీపీసీ విద్యార్థులు ఇటీవల గద్వాలలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎన్‌టీపీసీ సచ్దేవ పాఠశాల విద్యార్థులు కె. ఆదిత్య వర్ధన్, మణిదీప్‌లు పాల్గొన్నట్లు క్రికెట్ టీమ్ కోచ్ సుదేశ్ కుమార్ తెలిపారు.అలాగే, జి. దేవార్జున్ అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారని, అక్టోబర్ 31 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుదేశ్ తెలిపారు.పారిశ్రామిక ప్రాంతానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంపై కోచ్ సుదేశ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

మల్లూరు తాండ, బంజపల్లిలో మహిళా సంఘ భవనాలకు భూమిపూజ

బంజపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

నిజాంసాగర్, అక్టోబర్ 29 (జనం సాక్షి): నిజాంసాగర్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. మండల పరిధిలోని మల్లూరు తాండ, బంజపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘ భవనాలకు వారు భూమిపూజ నిర్వహించారు. అనంతరం బంజపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సంఘాలకు మెరుగైన వసతులు

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతోపాటు, మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మల్లూరు తాండ, బంజపల్లిలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘ కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి అవకాశం కలుగుతుంది. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ఇటువంటి మౌలిక వసతులు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ మహిళల సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

అనంతరం బంజపల్లి గ్రామంలో నిర్వహించిన రెహమాన్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. నూతన గృహంలోకి ప్రవేశించిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా ఈ గృహప్రవేశం గ్రామంలో ప్రాధాన్యత సంతరించుకుంది. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి భద్రతను, ఆత్మగౌరవాన్ని అందిస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరడం సంతోషకరమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్లు పట్లోళ్ల మల్లూరు, వినోద వెంకటరామిరెడ్డి, జనార్దన్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బంజపల్లి గ్రామ నూతన అధ్యక్షుడు గాండ్ల రమేష్‌కు ఘన సత్కారం

శాలువాతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

నిజాంసాగర్, అక్టోబర్ 29(జనంసాక్షి): నిజాంసాగర్ మండల పరిధిలోని బంజపల్లి గ్రామ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గాండ్ల రమేష్‌ను గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాండ్ల రమేష్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు చేపట్టిన గాండ్ల రమేష్ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని, గ్రామ ప్రజల సహకారంతో ముందుకు సాగాలని నూతన అధ్యక్షుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డిగారి రాంరెడ్డి (అడ్వకేట్), నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగులమల్యాల పాఠశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పరిశీలన

వంటగది నిర్మాణానికి ప్రధానోపాధ్యాయుడి విజ్ఞప్తి

కొత్తపల్లి అక్టోబర్ 29 (జనంసాక్షి)

నాగులమల్యాల గ్రామ పాఠశాల ను పర్యవేక్షించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల రాజా గౌడ్, అమిరిశెట్టి కనకయ్య గార్లు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు, అల్పాహారం,మధ్యాహ్న భోజనము ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వంటగది శిథిలమైనదని కొత్త వంటగది ఏర్పాటు చేపించాలని,ఊరిలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి తోడ్పాలని కోరారు, తెలంగాణ ప్రభుత్వం అల్పాహారం ఏర్పాటు చేయడాన్ని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు,

అనుమతులు లేకుండా కాలేజీ అడ్మిషన్స్ చేపడుతున్న రేసోనేన్స్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

నిజాంబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనం సాక్షి: నిజామాబాద్ జిల్లాలో అసలు ఎలాంటి అనుమతులు లేకుండా కనీస భవనం కూడా లేకుండా 2027- 2028 విద్యా సంవత్సరానికై జూనియర్ కాలేజీ అడ్మిషన్లు చేస్తున్నటువంటి ఖీవబనీనిజీనిఇవ యాజమాన్యం కఠినమైన చర్యలు తీసుకోవాలనిఈరోజు తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారికి (ఆఎఇూ) వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా ూం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల. మాట్లాడుతూ అసలు ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్ ప్రక్రియ చేయడం ఏమిటని అంతేకాకుండా ఈ సంవత్సరం పూర్తికానికి ఇంకా 6 నుంచి 7 నెలల సమయం ఉంది ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి అవ్వకుండానే తర్వాత సంవత్సరానికి జూనియర్ కళాశాల అడ్మిషన్స్ చేయడం దారుణమని ప్రభుత్వ కళాశాలలకు అదే విధంగా ప్రైవేటు కళాశాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు అసలు విద్యాశాఖ నుంచి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంత విచ్చల విడిగా అడ్మిషన్ ప్రక్రియ చేపట్టడం ఏమిటని తక్షణమే ఆ యాజమాన్యాన్ని సంప్రదించి వారిపై కఠిన చర్యలు తీసుకొని కళాశాల భవనము భవనం లేకుండానే ఇంటర్మీడియట్ నుంచి గుర్తింపు వచ్చిన తర్వాతనే అడ్మిషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ని కలుస్తామని అవసరమైతే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కు వెళ్లి ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

రి సర్వే అధికారులకు గ్రామస్తులు సహకరించాలి

ముస్తాబాద్ అక్టోబర్ 29 (జనం సాక్షి)

ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ , తెలుగు వారి పల్లె గ్రామంలో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అసిస్టెంట్ సర్వేలు పరిశీలించారు, సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం చేపడుతున్నటువంటి రీసర్వే పనులకు సంబంధించి సమగ్ర పనులకు గ్రామస్తులు గాని రైతులు గాని సహకరించి మీ పనులు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ ఎండి ఫారుక్, గ్రామ సర్పంచ్ భూక్యా రాజు నాయక్, మండల సర్వే అధికారి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్న రు

వైభవంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 29 (జనం సాక్షి)

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో శ్రీ కనకదుర్గ అంబా భవానీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం అమ్మవారి విగ్రహాన్ని డప్పు చప్పుళ్లు, భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా నిమజ్జనానికి బయలుదేరారు. మానేరు గంగమ్మ ఒడికి చేరుకునే క్రమంలో దారిపొడవునా భక్తులు అమ్మవారికి జలాభిషేకాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో సాగనంపారు. అమ్మవారి శోభాయాత్రతో నెహ్రూనగర్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో అంబ భవాని ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనంసాక్షి:
భారత మొదటి ఉపప్రధాని స్వర్గీయ సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ల ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివస్) వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉపన్యాస మరియు వ్యాస దక్షిణ పోటీలు నిర్వహించారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం పటేల్ చేసిన సేవలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో దేశభక్తి, ఐకమత్యం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని ఔూ కోఆర్డినేటర్ ఆచార్య కె. అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా నేడు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 'భారత ఉక్కుమనిషి ? నా స్ఫూర్తి ప్రదాత' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. అనంతరం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 'మనమంతా ఒక్కటే: కులం, మతం, భాషలకు అతీతమైన భారతదేశం' అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రసంగాలు, వ్యాసాల ద్వారా జాతీయ సమైక్యత, మతసామరస్యం, భిన్నత్వంలో ఏకత్వం, సమానత్వం ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.బి. బ్రహ్మరాంబిక, డాక్టర్ ఎం.డి. అతీఖ్ సుల్తాన్ ఘోరి, డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హలీమ్ ఖాన్, డాక్టర్ చి. శ్రీనివాస్, డాక్టర్ ఎన్. స్వామి, డాక్టర్ చి. నరసయ్యలు పాల్గొన్నారు.

భిక్కనూరు సిద్ధార్థ విద్యార్థులు ఎస్.జి.ఎఫ్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

అండర్ -17,అండర్-14 విభాగాల్లో ఏడుగురు విద్యార్థులకు అవకాశం

భిక్కనూరు అక్టోబర్ 29 (జనంసాక్షి):
భిక్కనూరు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుంచి నిర్వహించిన ఎంపికల్లో భిక్కనూరు సిద్ధార్థ విద్యాలయానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎస్.జి.ఎఫ్ జోనల్ స్థాయి అండర్-17,అండర్-14 వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో పదవ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ గౌడ్ ఎంపికకాగా బాలికల విభాగంలో టీ.అనూష,పి.శ్రీ చందన,ఎ.రిషిత ఎంపిక అయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో ఏడవ తరగతి విద్యార్థి నీల మణిదీప్, బాలికల విభాగంలో తిరుపరి చందన,కేతి వేదశ్రీ ఎంపికయ్యారు. ఒకే పాఠశాల సిద్ధార్థ పాఠశాల నుంచి రెండు విభాగాల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు లింగాల శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు,విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ వారి విజయానికి కృషిచేసిన పి.ఈ.టి బీరయ్యను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం పాఠశాలకు గర్వ కారణమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణకు మిషన్ అపరాజిత అండ

సఖి వన్ స్టాప్ సెంటర్ పోస్టర్, పాంప్లెట్ ఆవిష్కరించిన ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్..

భీంగల్ అక్టోబర్ 29 జనంసాక్షి:
మహిళల హక్కుల పరిరక్షణకు, గృహహింస బాధితులకు న్యాయం అందించేందుకు మిషన్ అపరాజిత అండగా నిలుస్తుందని కార్యక్రమ బాధ్యులు అడ్వకేట్లు భానుప్రియ, లావణ్య తెలిపారు. ఈరోజు ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ అపరాజిత ? సఖి వన్ స్టాప్ సెంటర్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, పాంప్లెట్‌లను ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్లు భానుప్రియ, లావణ్య మాట్లాడుతూ మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, గౌరవప్రదంగా జీవించేందుకు మిషన్ అపరాజిత సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. గృహహింస నిరోధక చట్టం (డీవీ యాక్ట్) ద్వారా మహిళలకు లభించే చట్టపరమైన రక్షణ, హక్కులపై అవగాహన కల్పించారు. డీవీ యాక్ట్ కింద బాధిత మహిళలు, పిల్లలకు రక్షణ, నివాస సదుపాయం, భరణం, పరిహారం తదితర అంశాల్లో చట్టప్రకారం న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మహిళలు ఎలాంటి హింసకు గురైనా భయపడకుండా తమ సమస్యలను తెలియజేసి సహాయం పొందాలని సూచించారు. మహిళల ఫిర్యాదులను స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 181 అందుబాటులో ఉందని, అవసరమైన మహిళలు ఈ సేవలను వినియోగించుకోవాలని వారు తెలిపారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడం, వారి హక్కులను కాపాడటం, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎలినినో దృష్ట్య నీటిని వృధా చేయకూడదు

పొదుపుగా వాడాలని చూచనలు చేసిన ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్

భీంగల్ అక్టోబర్ 29 జనం సాక్షి:
భీంగల్ మండలం బాబా నగర్ కాలనీలో ఈరోజు త్రాగునీటి సమస్యపరిష్కారం కోసనీ రూ. 1.50 లక్షలతో నూతనంగా వేసిన పైపులైను ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎలినినో దృష్ట్యా ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృధా చేయకూడదని కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు,ప్రతి ఇంటి దగ్గర వ్యక్తిగత ఇంకుడు గుంతలు తవ్వుకొని నీటి సంరక్షణ చేయాలని కోరారు..కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ లో జరిగే పాదయాత్రను విజయవంతం చేయండి..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (జనంసాక్షి)
నవంబర్ 5 న కరీంనగర్లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని గురువారం వేములవాడ భాజపా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా భాజాప రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా విద్రోహ శక్తులు చేస్తున్న ఆగడాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా నవంబర్ 5 న కరీంనగర్ లో జరిగే పాదయాత్ర కార్యక్రమానికి యువకులు దేశ ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ కరీంనగర్ లో జరిగే మహా పాదయాత్రకు ప్రతి ఒక్క కార్యకర్త, అభిమాని తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి,కౌన్సిలర్ కొండ్లీపు ముత్యం,నాయకులు రేగుల మల్లికార్జున్, రేగుల శ్రీకాంత్, వాసం మల్లేశం యాదవ్, రేగుల రాజకుమార్, వివేక్ రెడ్డి, ఎడ్ల కమలాకర్, కటకం శ్రీనివాస్, చిక్కుడు మల్లేశం,చేపూరి రాకేష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కమిషనర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనంసాక్షి:
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినముల సందర్భంగా (పోలీస్ ఫ్లాగ్ డే) పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో " రక్తదాన శిబిరం" కార్యాక్రమం ఉదయం 10 గంటలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య లాంచనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో ఇతరులకు ప్రాణదానం అవుతుందని, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని ప్రతీ ఒక్కరూ ఇటువంటి సామాజిక సేవవలలో పాల్గొని తోటి వారి ప్రాణాలను కాపాడ టములో తమ వంతు సహాయముగా రక్తదానం చేయడం అనేది ఒక సామాజిక కార్యక్రమం అని ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. మీరు ఒకరి ప్రాణం కాపాడినవారు అవుతారని తెలియజేశారు. ఈ రక్తదానం చేయడం ద్వారా మనం ఎందరికో కొత్తజీవం అందించిన వారు అవుతారు అని అన్నారు.

ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 155 యూనిట్ల రక్తాన్ని సేకరించాడం జరిగింది

ఈ రక్తదాన శిబిరంలో నిజామాబాద్ అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ చైర్మన్ పోతంకర్ లక్ష్మీనారాయణ , వైస్ చైర్మన్ డా. శ్రీను నాయక్ , మెడికల్ ఆఫీసర్ డా రవీంద్రనాథ్ సూరి , యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా. సరళ , నిజామాబాద్ ఏ.సి.పి ప్రకాష్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్ , మరియు రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు , ఎం.టి.ఓ , సీ.ఐలు ఆర్.ఎస్.ఐలు , ఎస్సైలు , మరియు పోలీస్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ: యం రాజేష్ చంద్ర

○నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

○ప్రజల ఫిర్యాదులలో నిర్లక్ష్యం చెయ్యరాదు!

భిక్కనూరు అక్టోబర్ 29 (జనం సాక్షి): భిక్కనూరు మండల కేంద్రంలో గల సర్కిల్ కార్యాలయం,పోలీస్ స్టేషన్ ను గురువారం కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు.ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల ఫైళ్లు,కోర్టు విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి ఫిర్యాదులను శ్రద్ధగావిని ఫిర్యాదు స్వీకరించి చట్టం పరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

రాత్రి వేళలో గస్తేని పటిష్టంగా నిర్వహిస్తూ,అనుమానాస్పద వ్యక్తులు,దొంగతనాలు ఇతరాత్రా కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేయడంతో పాటు, సైబర్ నేరాలు ఆన్లైన్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోలీసులు విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగేలా పనిచేయాలని అధికారులకు సిబ్బందికి సూచిస్తూ.శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ యం రాజేష్ చంద్ర సూచించారు. ఈ సందర్భంగా కామారెడ్డి డి.ఎస్.పి. ఎస్ మధుసూదన్. భిక్కనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ జగడం నరేష్, భిక్కనూరు ఎస్సై ఎస్. అనిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత పోటీల్లో విష్ణుజకు ప్రథమ బహుమతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక.. పాఠశాలకు, గ్రామానికి గర్వకారణం

సిరికొండ, అక్టోబర్ 29 జనంసాక్షి: జిల్లాస్థాయి ఆర్ట్ అండ్ కల్చరల్ ప్రోగ్రామ్?2026 పోటీల్లో సిరికొండ పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థిని తోకల విష్ణుజ సంగీత విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. నిజామాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న నిజామాబాద్ జిల్లా బాలభవన్‌లో పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో తన సంగీత ప్రతిభను చాటుకున్న విష్ణుజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విజయంతో పాఠశాలకు, సిరికొండ మండలానికి మంచి పేరు తీసుకొచ్చింది.సిరికొండ మండలంలోని పెద్ద వాల్గొట్ గ్రామానికి చెందిన లత, భోజన్న దంపతుల కుమార్తె విష్ణుజ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి కైవసం చేసుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆమె ప్రతిభకు గుర్తింపుగా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి విద్యార్థిని విష్ణుజను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కళలు, సంగీతం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యతోపాటు కళారంగాల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విష్ణుజ సాధించిన విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తన సంగీత ప్రతిభను చాటుకొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రక్తదానంతో ప్రాణదానం.. సేవలో పోలీసుల ముందడుగు!

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

సిరికొండ, అక్టోబర్ 29 జనంసాక్షి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం ఇచ్చే రక్తపు బొట్టు మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిజామాబాద్ లోని ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) హెడ్‌క్వార్టర్స్‌లో సీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విధుల నిర్వహణలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ చేపట్టిన ఈ కార్యక్రమంలో దర్పల్లి సర్కిల్ పరిధికి చెందిన 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందిని సీపీ సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు, అత్యవసర సమయాల్లో రక్తదానం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దర్పల్లి సీఐ రామన్, దర్పల్లి ఎస్ఐ సందీప్, సిరికొండ ఎస్ఐ రామకృష్ణతోపాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం పోలీసు శాఖ సామాజిక బాధ్యతను, సేవా స్ఫూర్తిని చాటింది.

పింఛన్, ఉపాధి హామీపై గ్రామసభ

"పలు రకాల రిజిస్టర్లు నమోదు చేయడం లేదు"

పెద్ద కొడప్గల్ అక్టోబర్ 29 (జనంసాక్షి): మండలంలోని బేగంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సునీత అధ్యక్షతన గురువారం "ఉపాధి హామీ పథకం, పింఛన్" పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్పి నర్సింలు మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం, పింఛన్ లపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ 10 పనులకు సంబంధించిన 4730 పని దినాలు జరిగినట్లు, 10,71,844 రూపాయలు కూలీల ఖాతలలో జమ చేసినట్లు తెలిపారు. 10 పని ప్రదేశాలలో జరిగిన పనులకు కేవలం ఒకే ప్రదేశంలో బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిన 9 ప్రదేశాలలో సోషల్ ఆడిట్ నిర్వహించగా బోర్డులు లేవని తెలిపారు. నలుగురికి తక్కువ రోజులు పనిచేస్తే ఎక్కువ డబ్బులు చెల్లించడం జరిగిందని, అదేవిధంగా ఫిష్ ఫండ్ లో 13 మందికి పనికి హాజరైన రోజుల కంటే తక్కువ రోజులు హాజరు వేసి డబ్బులు తక్కువ చెల్లించినట్లు తెలిపారు. కొలతల పుస్తకంలో కూలీల సంతకాలు తీసుకోవడం లేదన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. పింఛన్ గురించి చర్చించగా గ్రామంలో 105 మందికి ఐదు రకాల పింఛన్ వస్తున్నట్లు తెలిపారు. పింఛన్ కి సంబంధించిన పదిరకాల రిజిస్టర్లు నమోదు చేయాలి కానీ కేవలం ఒక రకం మాత్రమే సోషల్ ఆడిట్ లో చూపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత అంబయ్య, ఉప సర్పంచ్ ఎల్లప్ప, పంచాయతీ కార్యదర్శులు ఇందల్ సింగ్, శివాజీ, ఎఫ్ఏ, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం: ఏపీఎం ప్రసాద్

సదాశివనగర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించి స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని ఏపీఎం ప్రసాద్ సూచించారు. గురువారం సదాశివనగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షురాలు బాలంబాయి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు పొందడంతో పాటు, వడ్డీ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంక్యుబేటర్ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలని సూచించారు. మండల సమాఖ్య ద్వారా సీఐఎఫ్ నిధులతో గ్రామ సంఘాలు రుణాలు తీసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని, ప్రతి గ్రామ సంఘాన్ని లాభాల బాటలో నడిపించాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బాలంబాయి, కోశాధికారి స్వరూప, మహిళా సంఘాల ప్రతినిధులు, సీసీలు అంజాగౌడ్, అంజయ్య, భూమయ్య, నరేందర్ రెడ్డి, అకౌంటెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి 3.94 కోట్లు మంజూరు

- హర్షం వ్యక్తం చేసిన చైర్మన్ రొండి రాజు

- మర్రిపల్లి వద్ద 12 ఎకరాల్లో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం

వేములవాడ (జనంసాక్షి):
వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) నూతన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 3.94 కోట్లు (3,94,40,000) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితోనే ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు స్థలం అవసరమని తెలపగానే, ఎమ్మెల్యే సూచనతో జిల్లా కలెక్టర్ స్పందించి 12 ఎకరాల భూమిని కేటాయించారని చెప్పారు. ఆ స్థలంలో ఏఎంసీ భవనం, కార్యదర్శి భవనం, నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి సంబంధించి దాదాపు రూ.7 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి సమర్పించగా, ప్రభుత్వం రూ.3.94 కోట్లను విడుదల చేసిందని వివరించారు. మంజూరైన ఈ నిధులతో మర్రిపల్లి నూతన మార్కెట్ యార్డ్‌తో పాటు వేములవాడ యార్డ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం 11 రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిందని చైర్మన్ తెలిపారు. మర్రిపల్లి మార్కెట్ యార్డ్‌లో జంగిల్ క్లియరెన్స్, మైదానం సమం చేయడం, చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా, పురుషులు-మహిళలకు శౌచాలయాలు, ఆర్ అండ్ బి రోడ్డు నుండి అప్రోచ్ రోడ్డు, విద్యుదీకరణ పనులు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనితో పాటు వేములవాడ మార్కెట్ యార్డ్‌లోని కవర్డ్ షెడ్‌ను 20 నూతన వ్యాపార గదులుగా మార్చే పనులు కూడా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను విక్రయించు కోవడానికి మార్కెట్ యార్డ్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, గుర్రం విద్యాసాగర్, మ్యాక స్రవంతి హరి నందన్ రెడ్డి, కత్తి కనకయ్య, వస్తాద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

దళారులను నమ్మి మోసపోవద్దు

- మద్దతు ధరకే ధాన్యం అమ్మాలి

వేములవాడ రూరల్, అక్టోబర్ 29(జనంసాక్షి) :
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే మద్దతు ధరకు వరి ధాన్యం విక్రయించాలని వేములవాడ ఫ్యాక్స్ చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్, సర్పంచ్ సతీష్ రెడ్డి సూచించారు. గురువారం నమిలిగుండుపల్లి గ్రామంలో వేములవాడ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు.?ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు రైతుల సంక్షేమానికి యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తామని తెలిపారు. అధికారులు నేరుగా కల్లాల వద్దకే వచ్చి అందుబాటులో ఉంటారని, నీటి వసతి తక్కువగా ఉన్న రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఆరుతడి పంటలకు ఏఈఓల ద్వారా సబ్సిడీ విత్తనాలు ఇస్తున్నట్లు చెప్పారు.?ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుంద రెడ్డి, నాయకుడు సోయినేని కరుణాకర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు

31న జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనంసాక్షి:
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 31న (శనివారం) ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ప్రజాప్రతి నిధులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో విచ్చేయాలని కోరారు.

ఎమ్మెల్యేని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు

లింగంపేట్ అక్టోబర్ 29(జనం సాక్షి)
లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల చెందిన మండల కాంగ్రెస్ నాయకులు వార్డు సభ్యులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిరాం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే మదన్మోహన్రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యులు శంకర్, సునీల్, రాజుతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. లింగంపేట ఒకటో వార్డు రెండోవాడు వార్డుకు చెందిన వాడు సభ్యులు వార్డులో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అదేవిధంగా మురికి కాలువలు మంజూరు చేయాలని తాగునీటి సమస్య తలెత్త కుండా అదనంగా వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వివరిం చారు. త్వరలోనే హార్వులైనటువంటి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని వార్డు సభ్యులకు హామీ ఇచ్చారు. లింగంపేట మండలంలో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో నిరుపేదలైనటువంటి హారులైనటువంటి పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి హర్హులు అయినటువంటి పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారని హామీ ఇచ్చారు.గ్రామాల్లో నెలకొన్నటువంటి సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యేకు వివరించారు ఆయన సానుకూలంగా స్పందిం చారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సకాలంలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే ని కలిసిన వారిలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిరాం యాదవ్ గోకుల్, వార్డు సభ్యులు శంకర్, సునీల్, రాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు రఫీ యుద్దీన్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు అశోక్, బాణాపురం మాజీ సర్పంచ్ పీర్ సింగ్ పాటు తదితరులు ఉన్నారు.

పర్వేజ్ కార్ డెకర్స్ ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (జనంసాక్షి)
కామారెడ్డి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పర్వేజ్ కార్ డెకర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజాద్, బబ్లు, యూనుస్, జావీద్, సత్యం, భాస్కర్ గౌడ్, చిట్టిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు అలీ భీన్ అబ్దుల్లా, నాయకులు నాగరాజు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులను కలిసిన మైనారిటీ మండల అధ్యక్షులు

భీంగల్ అక్టోబర్ 29 జనం సాక్షి:
భీంగల్ మండల మైనారిటీ అధ్యక్షుడు కలీం ఆధ్వర్యంలో ధర్పల్లి సీఐ రమన్, సిరికొండ ఎస్సై రామకృష్ణ, ధర్పల్లి ఎస్సై సందీప్, భీంగల్ ఎస్సై తిరుపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ విషయంలో కచ్చితంగా తమ విధి నిర్వహణ ప్రదర్శించి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అతీక్, నదీమ్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలి

అదనపు కలెక్టర్ రాజాగౌడ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 జనంసాక్షి:
రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ దిశగా సంబంధిత శాఖలు కూడా సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత : నిజామాబాద్ అడిషనల్ డిసిపి శుభం ప్రకాష్

ఆర్మూర్,అక్టోబర్ 29(జనంసాక్షి):
రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యతని,రక్తదానం చేయడంతో ఎంతోమంది విలువైన ప్రాణాలు కాపాడవచ్చని నిజామాబాద్ అడిషనల్ డిసిపి శు భం ప్రకాష్ అన్నారు.ఆర్మూర్ పట్టణంలోని ఏంఆర్ గార్డెన్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆర్మూర్ డివిజన్‌పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో 160 మందికి పైగా యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం మహాదానంగా ఉంటుందని, ప్రాణదాతలుగా నిలుస్తున్న యువత మరింత ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వారిని శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, భీంగల్ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై రాము, మెండోరా ఎస్సై సుహాసిని, నందిపేట ఎస్సై వినయ్,బాల్కొండ ఇన్చార్జ్ ఎస్ఐ యాసిన్ అరాఫత్,ఆర్మూర్ ఎస్సై రజినీకాంత్, ఎస్సైలు కిరణ్ పాల్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

- విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డీసీపీ భూక్య రామ్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లి పట్టణంలోని అమర చందు కళ్యాణ మండపంలో పెద్దపల్లి డివిజన్ పోలీసులు, రెడ్‌క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ శిబిరంలో యువకులు, పోలీసు సిబ్బంది కలిపి మొత్తం 350 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించి యువత సేవాభావంతో ముందుకు రావాలని సూచించారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయం లేనందున ఆరోగ్యవంతులు రక్తదానానికి ముందుకు రావాలని, ప్రజల్లో దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.- 104వసారి రక్తదానం చేసిన రాజకుమార్‌కు సన్మానం : రంగాపూర్ గ్రామానికి చెందిన రాజకుమార్ 104వసారి రక్తదానం చేసి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ భూక్య రామ్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. నిరంతరం రక్తదానం చేస్తూ ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతగా నిలుస్తున్న రాజకుమార్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జి రమేష్ బాబు, ట్రాఫిక్ సిఐ బి శ్రీనివాస్,ఎస్‌ఐలు రాజశేఖర్, నాయిని మధుకర్,శ్వేత, నరేష్, శ్రీకాంత్,రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు కావేటి రాజగోపాల్,ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మధు,సీనియర్ జర్నలిస్ట్ బెజ్జంకి నరేష్,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సబ్బితం మాజీ సర్పంచ్ వార్డు సభ్యులు

- కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు చుంచు సదయ్య (మాజీ సర్పంచ్), మదాసి శ్రీనివాస్ (మాజీ ఉపసర్పంచ్), చుంచు చిన్న పెద్దులు (మాజీ ఉపసర్పంచ్), పులిపాక మనోజ రాజయ్య (వార్డు సభ్యులు), ఇండ్ల నాగతేజశ్విని - రమేష్ (వార్డు సభ్యులు), గుమ్మడి రాజేంద్ర ప్రసాద్ (వార్డు సభ్యులు), ఆకుల సతీష్ కుమార్ (వార్డు సభ్యులు), చెప్పాల రాజేశం (మాజీ వార్డు సభ్యులు),పేరుక పోచాలు (కాపు సంఘం అధ్యక్షులు),చుంచు సారయ్య,చుంచు సంపత్ ను మరియు పలువురు వార్డు సభ్యులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో సబ్బితం గ్రామ సర్పంచ్ నూనె సరోజన-రమేష్ ,పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్ లు మరియు సింగిల్ విండో చైర్మన్,మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతి నిధులు, మహిళలు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్మాల గ్రామంలో 14 ఏళ్ల బాలుడు అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబర్ 29, జనం సాక్షి:

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన మహమ్మద్ రెహాన్ (14) ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మొబైల్ ఫోన్ కొనివ్వాలని తండ్రితో పట్టుబడిన బాలుడు అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బంధువులు, పాఠశాల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి అక్టోబర్ 29న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి ఆచూకీ కనుగొనాలని కోరాడు.

మేట్లకు శిక్షణ కార్యక్రమం

ఎంపీడీవో దివ్య దర్శన్ రావు

సుల్తానాబాద్,అక్టోబర్ 29(జనంసాక్షి) :

మండలంలో నూతనంగా నియామకం అయిన మేట్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో దివ్య దర్శన్‌రావ్ అధ్యక్షతన నిర్వహించారు. వి బి జి రామ్ జి పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి కూలీల కుటుంబాలకు పథకం కల్పించిన 125 రోజుల పని తో పాటు వారి హాజరు నమోదు, నిర్దేశించిన వేతనం సకాలంలో అందడానికి గ్రామాలలో ప్రతి 40 మంది కూలీలకు ఒక మేటు చొప్పున ఎంపిక చేయడానికి ప్రభుత్వము ఆదేశాలు జారీ చేసిందని ఎంపీడీవో దివ్య దర్శన్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సుల్తానాబాద్ మండలంలో 166 మంది మేట్లను గ్రామపంచాయతీల ద్వారా గుర్తించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన మేట్లను మూడు బ్యాచిలుగా విభజించి మండల పరిషత్ కార్యాలయంలో తేదీ. 29.10.2026 నుండి 31.10.2026 వరకు శిక్షణ ఇవ్వడం కొరకు షెడ్యూలు ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రకారము గురువారం 10 గ్రామాలకు చెందిన 50 మంది మేట్లకు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీల హాజరు నమోదు, పనులు కల్పించడం, కొలతలు తీసుకోవడం లాంటి వాటిపై శిక్షణ అందించామని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నీలగిరి దివ్య దర్శన్ రావు,ఏ పీ ఓ మల్లీశ్వరి,జేఈ రాజ్ కుమార్,డి ఆర్ పి అనిల్ కుమార్‌తో పాటు సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

నాబార్డ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు

సుల్తానాబాద్,అక్టోబర్ 29(జనంసాక్షి) :

రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో నాబార్డ్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉమ్మడి సౌజన్యంతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఎ సి ఎస్ ద్వారా నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (పెద్దపల్లి) శాస్త్రవేత్త కోఆర్డినేటర్ డాక్టర్ ఓదెల సంపత్ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో నాణ్యమైన విత్తనోత్పత్తి చేపడితే రైతులకు మంచి రాబడి లభిస్తుందని, నాణ్యమైన విత్తనమే నాణ్యమైన దిగుబడికి పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్, డైరెక్టర్ బండ గోపాల్ ప్యాక్స్ కార్యదర్శి బూరుగు సంతోష్ కుమార్,సంఘ సిబ్బంది శ్యామ్, రాజులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బిజెపి ధర్నా

ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

సుల్తానాబాద్,అక్టోబర్ 29(జనంసాక్షి) :

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని,కొనుగోల్లు చేపట్టాలని బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి అని రైతులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకునేందుకు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తూ తాహసిల్దార్ కి వినతి పత్రం అందించారు. పెద్దపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు హాజరై మాట్లాడుతూ,వరి కొనుగోలులో ఆలస్యం జరగకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి రైతులు నష్టపోకుండా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ఎమ్ ఎస్ పి ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా చూడటంతో పాటు, తూకం, గన్నీ సంచులు, రవాణా వంటి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించి, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను సకాలంలో రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంక శంకర్, మాజీ మండల అధ్యక్షులు కొమ్ము తిరుపతి యాదవ్, జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు చాతరాజు రమేష్,కౌన్సిలర్ సమత కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చిట్టవేణి సదయ్య, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మాటూరీ లత, ప్రధాన కార్యదర్శి గుడ్ల వెంకటేష్,పసేడ్ల రవి,గుండ వెంకటేష్,ఓజ్జా సతీష్,మారం రమేష్,వల్స సాయికిరణ్,ఆగండ్ల శంకర్,తిరుపతి రావు,చాతరాజు అజయ్,చాతరాజు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఇంటి పెరట్లోనే గంజాయి సాగు చేసిన వ్యక్తి

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి పెరట్లో నే గంజాయి పెంచుతున్నడన్న సమాచారంతో ఆ స్థావరంపై పెద్దపల్లి ఎక్సైజ్ సిఐ రజిత.వారి సిబ్బంది,అండ్,టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రహస్యంగా సాగు చేస్తున్నట్లు సమాచారం తో అధికారులు తనిఖీలు చేపట్టారు.నిందితుడు నివాసం నుంచి రెండు పచ్చి ముక్కలు, ఎండబెట్టిన ఎనిమిది మొక్కలు జప్తు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ ఎం రజిత తెలిపారు.

మెగా మాక్ ప్రిలిమ్స్ ఎగ్జామ్-2026 విజేతలకు నగదు బహుమతుల ప్రదానం

పెద్దపల్లి,అక్టోబర్ 29 (జనంసాక్షి) :

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతను ప్రోత్సహించే లక్ష్యంతో యువశక్తి పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన లిమెగా మాక్ ప్రిలిమ్స్ ఎగ్జామ్- 2026లి విజేతలకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు.ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మొదటి బహుమతిగా రూ.10,000, రెండవ బహుమతిగా రూ.5,000, మూడవ బహుమతిగా రూ.2,000 చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అభ్యర్థులు మరింత కష్టపడి చదివి, పట్టుదలతో సాధన చేసి తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగంలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఇలాంటి మాక్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని, అభ్యర్థులు తమ సామర్థ్యాన్ని గుర్తించి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణారావు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాకూర్. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,జిల్లా మార్కెటింగ్ అధికారి (డిఎంఓ) ప్రవీణ్ రెడ్డి, యువశక్తి నిర్వాహకుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.యువతలో పోటీ పరీక్షల పట్ల అవగాహన పెంపొందించడం, వారి ప్రతిభను గుర్తించడం, పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా యువశక్తి పెద్దపల్లి చేపట్టిన ఈ కార్యక్రమం అభ్యర్థులకు ప్రేరణనిచ్చింది.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు మరియు సంఘీభావం మాజీ ఎమ్మెల్యే చందర్

- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్.డాక్టర్ దాసరి మమతా రెడ్డి

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతాలి రెడ్డి తెలిపారు.సమ్మె శిబిరాన్ని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తో కలిసి డాక్టర్ మమత రెడ్డి సందర్శించి ఉద్యోగులకు తమ మద్దతు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ"కోవిడ్ కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు, నేడు తమ భవిష్యత్తు కోసం మరియు ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కి పోరాడాల్సి రావడం అత్యంత విచారకరం. 'కోవిడ్ సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మేము...నేడు మా భవిష్యత్తు కోసం పోరాడుతున్నాం' అని వారు ఆవేదన వ్యక్తం చేయడం ప్రభుత్వానికి కంటికి కనిపించడం లేదా? ఐక్యతే మూలం–హక్కుల సాధనే లక్ష్యంగా పోరాడుతున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను మరియు ఉద్యోగ భద్రతను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎన్ హెచ్ ఎం జేఏసీ ప్రతినిధులు,ఆరోగ్య శాఖ ఉద్యోగులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటి దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తుల పట్టివేత

- బంగారు వెండి అభరణాలు స్వాధీనం - ఎస్ ఐ బి మల్లేష్

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను జూలపల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన ఆభరణాలను విక్రయించేందుకు వెళ్తుండగా బుధవారం పెద్దాపూర్ బస్‌స్టాప్ వద్ద నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై బి.మల్లేష్ తెలిపారు.కుమ్మరికుంటకు చెందిన ఎక్కిరాల రాకేశ్ (20), పెద్దాపూర్‌కు చెందిన కళ్ళెపెల్లి జాన్ (21),కళ్ళెపెల్లి సాయి చరణ్ (19) నిందితులుగా గుర్తించారు.నిందితులు ఎంచుకున్న విధానం.ఇంటి యజమానులు లేని సమయంలో తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి ఆభరణాలను దొంగిలించేవారని, బంగారాన్ని మహారాష్ట్రకు తీసుకెళ్లి కరిగించడం లేదా గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించడం చేసేవారని విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. జూన్ 15న కుమ్మరికుంటలో వడ్లూరి సాగర్ ఇంట్లో, సెప్టెంబర్ 21న పెద్దాపూర్‌లో కొత్తపల్లి పద్మ ఇంట్లో, అక్టోబర్ 14న అదే గ్రామానికి చెందిన కళ్ళెపెల్లి అంజయ్య ఇంట్లో జరిగిన చోరీల్లో నిందితుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.వారి నుంచి సుమారు 10 గ్రాముల బంగారు ముద్ద, 2.9 గ్రాముల బంగారు చెవి కమ్మలు,58 గ్రాముల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇళ్లను విడిచి వెళ్లేటప్పుడు భద్రతా చర్యలు తీసుకోవాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జూలపల్లి ఎస్సై మల్లేష్ తెలిపారు.

చామనపల్లి గ్రామంలో ఆర్ & ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

- నంది మేడారం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వకు అనుగుణంగా చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ

- ప్రతి ఇంటికి ప్రాజెక్టు నంబర్ కేటాయించి, అర్హులకు చట్ట ప్రకారం పరిహారం అందేలా చర్యలు

ధర్మారం,అక్టోబర్ 29(జనంసాక్షి) :

చామనపల్లి గ్రామంలో ఆర్ ఢ ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఆర్ అండ్ ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, నంది మేడారం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచు కొని, నిబంధనల్లో సడలింపులు కల్పిస్తూ గ్రామం మొత్తాన్ని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామంలోని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక ప్రాజెక్టు నంబర్ కేటాయించి, ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలతో పాటు చెట్లు, మోటార్లు, ఇతర పరికరాలు తదితర ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.సేకరించిన వివరాల ఆధారంగా చట్ట ప్రకారం అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, పక్కాగా నిర్వహిస్తున్నామని తెలిపారు.సర్వే బృందాలకు గ్రామ ప్రజలు తమ పూర్తి వివరాలను అందించి, సర్వే ప్రక్రియ

సజావుగా పూర్తయ్యేందుకు సంపూర్ణ సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు.ఈ పర్యటనలో అదనప కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు

1064 టోల్ ఫ్రీ నెంబర్ తో అవినీతికి అడ్డుకట్ట

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- అవినీతి నిరోధక వారోత్సవాలు సందర్భంగా ప్రతిజ్ఞ చేయించిన అదనపు కలెక్టర్

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ఆవరణలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా అధికారులు తహసి ల్దారులు సిబ్బందిచే అవినీతి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారు లు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు.మనమంతా నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు.అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలను ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కుఆ హక్కును లంచం తో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ ప్రజలకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది,జిల్లా అధికారులు తహసిల్దారులు,తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి జూనియర్,డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థుల రక్తదానం

పెద్దపల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి) :

భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళిగా పెద్దపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రాణదానం కంటే గొప్ప దానం లేదనే సందేశాన్ని చాటుతూ, సమాజ సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లంకి శ్రీనివాస్, డీసీపీ రామ్ రెడ్డి, సిఐ కె ప్రవీణ్ కుమార్, జి రమేష్ ,బి శ్రీనివాస్, ఎస్ ఐ లు,రాజశేఖర్, మధుకర్,శ్వేత నరేష్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సమ్మద్ మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.పోలీసు అమరవీరులకు ఘన నివాళి,రక్తదానం ద్వారా ఎన్నో ప్రాణాలకు జీవదానం!